అందాల పోటీల వల్ల ఒరిగిందేమిటీ?

పోచమ్మమైదాన్, జూన్ 1: హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ సుందరీమణుల అందాల పోటీలతో రాష్ట్రానికి ఒరిగిందేమిటని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 108 దేశాల నుంచి పాల్గొన్న అందాలభామలతో పోటీలు నిర్వహించి, ముగింపు సమావేశం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమయంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఈ పోటీలు ఎవరి కోసం ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ముందుగా ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విఫలమైతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పాడి గేదె మృతదేహం

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

ఖానాపురం, జూన్ 1: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలకేంద్రం శివారు కాకులగుడ్డాల ప్రాంతంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన ఊరటి కుమారస్వామికి చెందిన పాడిగేదె కాకులగుడ్డాల ప్రాంతంలోని పెన కరాజు పొలంలో గడ్డి మేసేందుకు ఆదివారం ఉదయం వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం నుంచి మోటర్‌కు వెళ్లే సర్వీస్ వైర్ గేదెకు తాకగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ. లక్ష నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా నా క్రయింటు అయిన చెన్నమనేని జయశ్రీ మేనేజింగ్ పార్టనర్ మంజునాథ రియల్ ఎస్టేట్స్ మరియు సాయినాథ్ ఎంక్లేవ్ గారు సర్వేనెంబర్ 385, 386, 177, 199/A 199/B, 200 & 201 రంగశాయిపేట్ గ్రామము, భీలావరంగల్ మండలం, వరంగల్ జిల్లాలోని ఎ॥ 23-22 గుంటల భూమిని వేరు వేరు రిజిస్ట్రీ దస్తావేజుల ద్వారా కొనుగోలు చేసి KUDA పర్మిషన్ ద్వారా లే అవుట్ ప్లాన్ ద్వారా ప్లాట్స్ చేసినారు. అట్టి లేఅవుట్ D.P.No. 87/2003 మరియు లేఅవుట్ మ్యాప్ ఫైల్‌ను C3/1310/2003 పొంది ఉన్నారు. కాగా బొమ్మగాని (గట్టు) విజయ అను వ్యక్తి తప్పుడు కాగితములు సృష్టించి సివిల్ దావా ఓ.ఎస్. నెంబర్ 1695/2004 ను అప్పటి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వరంగల్ నందు నా క్లయింట్ పై కేసు వేసినారు. దావా దివి. 17-12-2014 నాడు ఇట్టి కేసును న్యాయస్థానం కొట్టివేసి నా క్లయింట్‌కు అనుకూలంగా తీర్పు వెలువడించినారు. సదరు బొమ్మగాని (గట్టు) విజయపైన తెలిపిన కేసు ఓడినప్పటికీ మోసపూరితంగా, దురుద్దేశంతో 1) వీరమల్ల వేణు 2) కీ॥శే॥ బత్తిని చంద్రశేఖర్ 3) బత్తుల సంపత్ మరియు 4) బొమ్మగాని శ్రీనివాస్ అను వ్యక్తులతో కలిసి తప్పుడు అగ్రిమెంటు-కం-జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఎ. 1-08 గుంటల భూమికి సృష్టించి మోసపూరితంగా అమ్మ చూపుటకు ప్రయత్నిస్తున్నారు. పైన తెలిపిన సదరు వ్యక్తులకు గాని వారి ద్వారా కొనుగోలు చేయు వ్యక్తులకు గాని చట్టపరంగా ఇటువంటి హక్కులు సంక్రమించబోవని మరియు పైన తెలిపిన అగ్రిమెంటు-కం-జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ తేదీ. 20-4-2009, దస్తావేజు నెం. 1813/09 చట్టపరంగా చల్లనేరదని ఇట్టి ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. మరియు పైన తెలిపిన సర్వే నెంబర్లలో గల భూమికి నా క్లయింట్ సర్వహక్కు భుక్తములు కలిగి ఉన్నది. కావున ఎవరైనా నా క్లయింట్ యొక్క భూమిపై మోసపూరితంగా క్రయవిక్రయాలు జరిపినచో చట్టపరమైన చర్యలకు అర్హులగుదురని ఇట్టి బహిరంగ ప్రకటన ద్వారా సమస్త జనులకు తెలియజేయునైనది.

ఇట్లు **బెల్లి జగదీష్ యాదవ్,** అడ్వకేట్
ఇ.నెం. 2-7-1137/106, నీలం ఎన్‌క్లేవ్, కనకదుర్గ కాలనీ, హనుమకొండ. సెల్: 9908171829

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★Hnk గోపాలపూర్ భద్రకాళి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఈస్ట్ ఫేసింగ్ 300 స్క్వేర్ యార్డ్స్ 30 ఫీట్ల రోడ్డు మంచి వాస్తు క్లియర్ టైటిల్ గల ప్లాటు అమ్మబడును No Brokers cont : **8790501225** and **99499 12347**.

NTW-337079

WANTED

★**ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు.** మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

శోభాయాత్రలో పాల్గొన్న నన్నపునేని నరేందర్, వాణి దంపతులు

ధన మైసమ్మకు నన్నపునేని పూజలు

ఖిలావరంగల్, జూన్ 1: శివనగర్‌లోని శ్రీమెట్లబావి ధన మైసమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వాణి దంపతులు ఆదివారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భారీగా పొగాకు ఉత్పత్తుల పట్టివేత

పొగాకు ఉత్పత్తులను చూపుతున్న పోలీసులు

వరంగల్‌చౌరస్తా, జూన్ 1: నగరంలో మరోసారి టాస్క్‌ఫోర్స్ పోలీసులు భారీగా పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌రావు కథనం ప్రకారం.. శనివారం రాత్రి మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోచమ్మమైదాన్ ప్రాంతంలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో నిఘా ఏర్పాటు చేసి గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న తిరుమల రమేశ్‌ను అదుపులోకి తీసుకొని, సుమారు రూ. 4.64 లక్షల విలువైన 14 రకాల నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కాలను పట్టుకున్నారు. రమేశ్‌ను తదుపరి విచారణ కోసం మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ, టీం సభ్యులు పాల్గొన్నారు.



సైనికుడు హరిశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

సైనికుడికి ఘన సన్మానం

సంగెం, జూన్ 1: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికుడు సట్ల హరీశ్‌గౌడ్‌ను ఆదివారం ఎల్గూర్‌రంగంపేటలో ఘనంగా సత్కరించారు. వర్ధన్నపేట మండలం ఇల్లందుకు చెందిన సైనికుడు సట్ల హరీశ్‌గౌడ్ ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నాడు. గ్రామానికి వచ్చిన ఆయనను స్థానికులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బందెల అంజలి, రమేశ్‌బాబు, రజిని, వినోద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

రాయపర్తి, జూన్ 1: మండలంలోని బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య జరుగుతున్న గొడవల కారణంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో మండల నాయకులు రంగు కుమార్, గారె నర్సయ్య, లేతాకుల రంగారెడ్డి, చందు రామ్‌యాదవ్ ఉన్నారు.

సత్యనారాయణరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

చెన్నారావుపేట, జూన్ 1: చెన్నారావుపేట సహకార సంఘం మాజీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఆదివారం నిర్వహించిన సత్యనారాయణరెడ్డి దశదినకర్మకు బీఆర్ఎస్ మండల బాధ్యుడు బాల్నె వెంకన్న ఆధ్వర్యంలో నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పత్తినాయక్, పీఏసీఎస్ నూతన చైర్మన్ చింతకింది వంశీ, నాయకులు మహేందర్‌రెడ్డి, కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, ప్రదీప్‌కుమార్, ములుక సాంబయ్య, రాజ్‌కుమార్, సీఈవో చిట్టె రవి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడి

గీసుగొండ, జూన్ 1: మతిస్థిమితం లేని మహిళపై ఒకరు లైంగిక దాడి చేసిన ఘటన మండలంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తుతెలియని మతిస్థిమితం లేని మహిళను మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మిథున్‌చౌరే ధర్మారం గ్రామంలో రైల్వే పట్టాల కింద ఉన్న అండర్‌గ్రౌండ్ మోరీలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మిథున్‌చౌరేపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- పనులను పరిశీలించిన కలెక్టర్ సత్యశారద
- పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- అధికారులకు ఆదేశాలు
- నేడు హాజరు కానున్న ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి

కోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు చారిత్రక ఖిల్లాలోని ఖుష్‌మహల్ మైదానం ముస్తాబైంది. పోలీసు కవాతు, సంక్షేమ పథకాలకు సంబంధించిన స్టాళ్లు, వేదిక, వీఐపీ గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను కలెక్టర్ సత్యశారద ఆదివారం పరిశీలించారు. వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ, 10.15 గంటలకు పోలీసు గౌరవ వందన స్వీకారం, 10.30 గంటలకు ప్రసంగం, 11.05 తెలంగాణ అమరవీరులకు నివాళి, 11.15 గంటలకు శకటాల ప్రదర్శన, 11.25 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11.40 స్టాళ్ల సందర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కాల్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌ను కలెక్టర్ సత్యశారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసిన చెన్నారావుపేట మండలం సూరిపల్లి రైతు చంద్రశేఖర్, పర్వతగిరి మండలానికి చెందిన రైతు మధుతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసిన తర్వాత సమస్యల పరిష్కారంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 18004253424ను వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ధాన్యం సేకరణ, రవాణా, మద్దతు ధర సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

12మంది పోలీసులకు సేవా పతకాలు

సుబేదారి, జూన్ 1: రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పని చేస్తున్న 12 మంది పోలీసు అధికారులను సేవా పతకాలకు జిల్లా అధికార యంత్రాంగం ఎంపిక చేసింది. హనుమకొండ ఏఎస్సై ఏ రఘురెడ్డికి ఉత్తమ సేవా పతకం, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సీసీఆర్‌బీలో పని చేస్తున్న ఎస్సై జే విల్‌సన్, సుబేదారి ఏఎస్సై పీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎస్సైలు ఎండీ మెహ్బాల్ పాషా, ఎం రామ్‌ధన్, కాజీపేట ఏఎస్సై వీ చంద్రమౌళి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బుస్సు భీమయ్య, కానిస్టేబుళ్లు బీ రమేశ్, కే తిరుపతిగౌడ్‌కు పతకాలు దక్కాయి. ఈ సందర్భంగా అధికారులు, పోలీస్ సిబ్బంది వీరిని అభినందించారు.

కాపర్ వైర్ దొంగల అరెస్టు

దామెర, మే 1: వ్యవసాయ మోటర్లు, కాపర్ వైర్ దొంగిలించిన కేసులో పలువురుని అరెస్టు చేసినట్లు ఎస్సై అశోక్ ఆదివారం తెలిపారు. ఒడిషాకు చెందిన మాలిక్‌రాజు(29), వరంగల్ జిల్లాకు చెందిన గుగులోత్ నవీన్(26)ను అరెస్టు చేసి వారివద్దు ఉన్న 153కిలోల కాపర్ వైర్, స్కూటీ, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

సారంగపాణి (ఫైల్)

సంగెం, జూన్ 1: ఒంటరితనం భరించలేక మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బోల్లపెల్లి సారంగపాణి(70) గీత కార్మికుడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండేవారు. భార్య, కుమారుడు, పెళ్లి అయిన తర్వాత కుమార్తె(ఇద్దరు బిడ్డల తల్లి) మృతి చెందారు. భార్య చనిపోయిన తర్వాత సారంగపాణి మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. ఆమె ఐదేళ్ల క్రితం విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. వరుసగా కుటుంబ సభ్యులు మృత్యువాత పడడం, రెండో భార్య వెళ్లిపోవడంతో మానసింగా కుంగిపోయాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత తన గదిలో పడుకున్నాడు. ఉదయం ఎంతకూ లేవకపోవడంతో అతడి మనుమడు, కుమారుడు తలుపులు తీసి చూడగా ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు బోల్లపెల్లి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎల్. నరేష్ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి కవాతులో పాల్గొన్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

వరంగల్‌చౌరస్తా, జూన్ 1: వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్ డివిజన్ పోలీసులతోపాటు ఆయుధాలు ధరించిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ భద్రతా దళాలతో ఆదివారం పోచమ్మమైదాన్ నుంచి వరంగల్‌చౌరస్తా, రైల్వేస్టేషన్ జంక్షన్, వెంకటరమణ జంక్షన్, చింతల్ ఆర్వోబీ మీదుగా భీలావరంగల్ వాకింగ్ గ్రౌండ్ వరకు ర్యాలీ కొనసాగింది. వరంగల్ బస్టాండ్ సెంటర్‌లో కేంద్ర బలగాలు, సబ్ డివిజన్ పోలీసులు మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, పరస్పర దాడులు, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, ఇంతేజార్‌గంజ్ సీఐ షూకుర్, సబ్ డివిజన్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, 100 మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ భద్రతా దళ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి రద్దు

ఖిలావరంగల్, జూన్ 1: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు కార్యాలయానికి నేడు రావొద్దని కోరారు.

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రైతులు భూసార పరీక్షలు చేసుకోవాలి

దుగ్గొండి, జూన్ 1: రైతులు భూసార పరీక్షలకనుగుణంగా పంటలు సాగు చేయాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పి.రత్నకుమార్ సూచించారు. వికసిత్ సంకల్ప్ అభియాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మహ్మదపురం, మర్రిపల్లి, తిమ్మంపేటలో రైతు సదస్సులు నిర్వహించారు. నూనె గింజల పంటలైన వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమలు వంటి పంటలు వేసే సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల ఎరువుల వినియోగ శాతాన్ని తగ్గించొచ్చని సూచించారు. పత్తి, మక్కజొన్న, వరి పంటలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని, స్వల్పకాలిక విత్తనాలు వాడడం వల్ల పంట దిగుబడి సమయం తగ్గుతుందన్నారు. అనంతరం తిమ్మంపేటలో మత్స్య సంపద కిసాన్ యోజనలో భాగంగా చేపల విలువ ఆధారిత ఉత్పత్తులపై మత్స్యకారులు అవుట్‌లెట్ సబ్సిడీ పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జి.గణేశ్, డాక్టర్ కె.శ్రీధర్, సారంగపాణి, ఏఈవో రాజేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు

ప్రాథమిక విద్యకు గొడ్డలి పెట్టు: డీటీఎఫ్

నెక్కొండ, జూన్ 1: ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి కలెక్టర్లకు అధికారమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) కౌన్సిలర్ జాన్‌నాయక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.బాలాజీ, డి.కుమారస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెబుతూనే మరోవైపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కుదింపునకు ఉత్తర్వులు జారీ చేయడం ఏంటని ప్రశ్నించారు. పిల్లలు తక్కువగా ఉన్నారన్న ఉద్దేశంతో టీచర్లను వేరే పాఠశాలలకు బదిలీ చేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను నియమించడం భావ్యం కాదన్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు 18 సబ్జెక్టులు, 60 మంది పిల్లలు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు ఎలా విద్యాబోధన చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి తరగతికి ఒక గది ఉండేలా చూడాలన్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

'కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

సంగెం, జూన్ 1: కుల బహిష్కరణ చేసి తమను మానసికంగా వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రానికి చెందిన చెల్కలపల్లి పైడయ్య ముదిరాజ్ కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన కుల పెద్దమనుషులైన చెల్కలపల్లి నాగరాజు, నీరటి రమేశ్ ఎల్గూర్‌చెరువులో చేపలు పట్టే విషయంలో కుల బహిష్కరణ చేశారు. కులంలో జరిగే శుభకార్యాలకు వారిని పిలవడం లేదు. వారింట్లో జరిగిన శుభకార్యాలకు పిలిచినా కులస్తులు రావడం లేదు. పైడయ్య కుటుంబంలో జరిగే శుభకార్యాలకు కులస్తులు వెళ్తే రూ. 10 వేల జరిమానా చెల్లించాలని అల్టిమేటం జారీ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన తాము ఇబ్బందులు పడుతున్నామని బాధితులు చెప్పారు. కుల బహిష్కరణ చేసిన పెద్ద మనుషులపై చర్యలు తీసుకోవాలని పైడయ్య కోరారు.

సీపీకి మహిళా రైతు ఫిర్యాదు

ఫిర్యాదు ప్రతిని చూపిస్తున్న మహిళా రైతు

పర్వతగిరి, జూన్ 1: తనకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని ఏనుగల్‌కు చెందిన మహిళా రైతు బోలుగొడ్డు స్వరూప వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె కథనం ప్రకారం.. ఏనుగల్‌లోని 499/ఏ సర్వే నంబర్‌లో తనకున్న 4.37 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు ఇచ్చింది. కౌలుదారులు సాగు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కానుగంటి నవీన్, నల్లపు సౌందర్య, నల్లపు ఉష, వడ్డె రాణి అడ్డగించారు. ఈ విషయాన్ని ఎస్సైకి ఫోన్ చేసి చెప్పగా కానిస్టేబుళ్లను పంపించి భూమిలో విత్తనాలు వేయొద్దని సదరు వ్యక్తులకు సూచించారు. అయినా వారు విత్తనాలు వేశారు. తన భూమిని ఇతరులు సాగు చేయకుండా చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. భూమిపై తనకు పూర్తి హక్కులు ఉన్నాయని, అయినా న్యాయం చేయడంలో పోలీసులు విఫలమయ్యారని సీపీకి విన్నవించారు.

లేబర్‌కాలనీలో చోరీ

కరీమాబాద్, జూన్ 1: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేబర్‌కాలనీ గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సాతరాజు రేణుక తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. దొంగతనం జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రూ. 14 లక్షల నగదుతోపాటు ఐదున్నర తులాల బంగారు అభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

3 నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

దుగ్గొండి/సంగెం, జూన్ 1: భూ భారతి చట్టంపై మంగళవారం నుంచి 13వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవిచంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 3న అడవిరంగాపురం, మధిరమందపల్లి, 4న మందపల్లి, చలపర్తి, 5న రేఖంపల్లి, తొగర్రాయి, 6న నాచినపల్లి, పొనకల్, 9న మహ్మదాపురం, తిమ్మంపేట, 10న వెంకటపురం, రేబల్లె, 11న కేశవపురం, లక్ష్మీపురం, 12న ముద్దునూరు, పోలారం, 13న మల్లంపల్లి, దుగ్గొండిలో సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

సంగెం మండలంలో..

సంగెం మండలంలో రేపటి నుంచి సదస్సులు ఉంటాయని తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. 3న వెంకటాపురం, తిమ్మాపురం, 4న కాట్రపల్లి, చింతలపల్లి, 5న కాపులకనపర్తి, పల్లార్‌గూడ, 6న రాంచంద్రాపురం, పల్లార్‌గూడ, 9న గవిచర్ల, మొండ్రాయి, 10న గవిచర్ల, ముమ్మిడివరం, 11న లోహిత, నార్లవాయి, 12న షాపురం, ఎల్గూర్‌రంగంపేట, 13న ఎల్గూర్‌రంగంపేట, తీగరాజుపల్లి, 16న నల్లబెల్లి, సంగెం, 17న సంగెం రైతు వేదికల్లో సదస్సులు ఉంటాయన్నారు.

ఆదర్శ గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శి కరువు

- ఇన్‌చార్జి అధికారే దిక్కు
- కుంటు పడుతున్న గ్రామాభివృద్ధి

గీసుగొండ, జూన్ 1: జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లికి రెగ్యులర్ కార్యదర్శి లేక నిరంతరం జరిగే పారిశుధ్య పనులతోపాటు అభివృద్ధి కుంటుపడుతున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని మాజీ సర్పంచ్, శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి పేర్కొన్నారు. ఏడాది కాలంగా ఇన్‌చార్జి కార్యదర్శి పాలన సాగుతున్నదని వాపోయారు. పలుమార్లు అధికారులను కలిసి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని కోరినట్లు తెలిపారు. గతంలో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి గ్రామస్తులు విన్నవించారు. ప్రజాపాలన సభకు హాజరైన కలెక్ట